# మరీచిక

'వింధ్యవాసిని'

చక్కని చిన్న డాబా ఇల్లు. ఇంటిని నింపుతూ అవసరమయిన ఫర్నిచరూ, సామగ్రి, అన్నిటినీ మించి ఏం కావాలన్నా నిముషాల్లో తెచ్చిపెట్టే శ్రీవారు – కొత్తగా కాపురాని కొచ్చిన ఏ యువతి అయినా ఇంతకన్నా కోరుకునేదేముంది? పెళ్ళయిన నెల రోజులకి అవేళే శ్రీవారి వెంట ఆ ఇంట అడుగుపెట్టిన నేను, ఆయన్ని మెచ్చుకోకుండా ఉండలేపోయాను.

సాయంత్రం ముఖం కడుక్కుని, మేడ మీద గదిలో కిటికీ దగ్గర నిలుచుని చుట్టూ చూశాను. వాతావరణం ప్రశాంతంగా వుంది. సూర్యాస్తమయం దగ్గరవుతూండటం వల్ల, వెలుగు తగ్గుతూ వుంది. నా దృష్టి హఠాత్తుగా ఎదురుగా వున్న మేడపై పడింది. సరిగ్గా మా కిటికీ కెదురుగా వున్న వాళ్ళ కిటికీ తెరచి వుంది. ఆ కిటికీ దగ్గిర ఒకతను కూర్చుని వున్నాడు. వయసు పాతికేళ్ళుండొచ్చు. పచ్చని ముఖం, ఉంగరాల జుత్తు ఇక్కడికే స్పష్టంగా కనిపిస్తున్నయ్. కొద్ది క్షణాల పాటు అటే చూస్తున్న నేను, ఉన్నట్లుండి అతగాడి దృష్టి ఇటే వున్నట్లు గుర్తించటంతో ఉలిక్కిపడి అక్కడి నుంచి తప్పుకున్నాను. నా చూపు అతని చూపుతో కలిసినప్పుడు అతడు చిన్నగా నవ్వినట్లు కూడా అనుమానం రావటంతో నా గుండెలు కొట్టుకున్నాయ్. అలాగే వాలు కుర్చీలో కూచుండిపోయిన నేను శ్రీవారి పిలుపుతో గానీ తేరుకోలేకపోయాను.

"ఏఁవిటోయ్? ఇంకా అలాగే కూచుండిపోయావ్? రెడీ అయుంటావేమో, నీకు వూరంతా చూపిద్దామని నేననుకుంటుంటే...." అన్నారు.

"నాదేముంది? పనంతా అయిపోయిందిగా? మీదే ఆలస్యం. పదండి – ముందు కాఫీ తీసుకుందురుగానీ" అంటూ వంట గదిలోకి దారి తీశాను. ఆటు తర్వాత శ్రీవారి ప్రేమలో, మాటల్లో షికారులో పడి ఆ సాయంత్రం జరిగిన విషయాన్ని పూర్తిగా మరిచిపోయాను. మరురోజు సాయంకాలం శ్రీవారికోసం ఎదురు చూస్తూ మళ్ళీ మేడ కిటికీ దగ్గిర నిలుచున్నాను. అక్కడినించి ఐతే వీధి చివరిదాకా చక్కగా కన్పిస్తుంది. అసంకల్పితంగా నా దృష్టి ఎదురు కిటికీ పైనా, అందులోంచి కనిపిస్తున్న వ్యక్తి పైనా పడ్డది. అచ్చం నిన్నలానే కూచుని ఇటే చూస్తున్నాడు. నాకెందుకో భయంవేసింది అటు చూడటానికి. ఇంతలో ఆ గదిలో కెవరో రావటం, అతడిదృష్టి మళ్ళటం గమనించాను. కుతూహలంగా చూస్తే ఓ యువతి కన్పించింది–అతడితో మాట్లాడుతూ. మాట్లాడుతున్నప్పుడు ఆమె ముఖం, అతడితో ప్రదర్శిస్తున్న చనువూ చూస్తే; తప్పకుండా అతగాడి భార్యే అయివుండాలనిపించింది. 'అంత చక్కని భార్య వుండీ, ఇతగాడికీ కిటికీ దగ్గిర కూచునే రోగమేమిటో?' అనుకున్నాను. అతగాడు కిటికీలోంచి చూస్తేమాత్రం–నేనెందుకు చూడాలి? అనుకుని నాలిక్కొరుక్కున్నాను. మళ్ళీ శ్రీవారి రాకతో అంతా మరిచిపోయాను.

మరుసటి రోజు ఉదయం శ్రీవార్ని సాగనంపి తలుపు వేసుకుంటుండగా ఎదురింటి తలుపు దగ్గర నిన్న కన్పించిన యువతి, అయిదేళ్ళ పాప కన్పించారు. పిలకల్లాంటి రెండు జడలు, చక్కని యూనిఫారమ్, స్కూల్ బాగ్‌తో ముచ్చటగా వుంది పాప. మెట్ల మీద నిలుచుని, "అమ్మా టాటా" అంటూ గేటువైపుగా వచ్చింది పాప. అయితే అతగాడికో పాప కూడా ఉందన్న మాట అనుకున్నాను.

సాయంత్రం మేడగది కిటికీ దగ్గిర కెళ్ళకూడదని నిర్ణయించుకున్నాను. ఆరుగంటలయినా ఆయనింకా ఇంటికి రాలేదు. విసుగ్గా వుంది. ఓసారి కిటికీలోంచి చూస్తే ఏం–అన్పించింది. చూసీ చూడగానే ఎదురు కిటికీలో అతడి ముఖం కన్పించింది! చటుక్కున కిటికీ తలుపు మూసేసి, చిరాకుగా కిందకి వెళ్ళిపోయాను. మా కిటికీని మేము ఉపయోగించుకోకుండా ఈ న్యూసెన్స్ ఏఁవిట్రా దేవుడా అనుకున్నాను. కొంతమంది మగాళ్ళకిదో జబ్బు కాబోలు. చక్కని భార్య, ముచ్చటయిన పాప వున్నా వాడికిదేం రోగం? ఈ ఇంట్లో ఎవరున్నా ఇదే శిక్ష అనుభవించాల్సిందేనా? లేక మేము వచ్చాకే ఇలా మొదలు పెట్టేడా? అర్థం కాలేదు. పోనీ ఆయనకి చెబుదామా అన్పించింది. అంతలో నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది. ఆయనకి చెబితే మాత్రం ఆయనేం చేస్తారు? ఎదురింటి అతడి దగ్గిరికి వెళ్ళి, "ఏఁవయ్యోః! మా ఇంటి వయిపలా చూడకు. మా ఆవిడకి చాలా కష్టంగా వుందట!" అని చెబుతారా? చెబితే మాత్రం, "నా ఇంట్లో నా ఇష్టం వచ్చినట్లుంటాను. మధ్యన మీ గొడవేమిటి?" అని అతను అనకుండా వుంటాడా? ఈ సమస్యకి ఒకటే పరిష్కారం. ఈ కిటికీ దగ్గిర నిలుచోటం మానెయ్యాల్సిందే. తప్పదు – అని నిర్ణయించుకున్నాను.

ఆ మరురోజు ఆదివారం. మధ్యాహ్నం 11గం.కి కాబోలు ఆయనేదో ఆఫీసుపని చేసుకుంటున్నారు- మేడగదిలో కూచుని. ఓ కప్పు కాఫీ తెమ్మంటే, తీసుకుని పైకి వెళ్ళాను. ఆయన చేతికి కప్పు అందిస్తూ, కిటికీవైపు చూశాను. ఎదురింటతను కనిపించాడు. ఎంత ధైర్యం! ఈయన ఇంట్లో వుండగా, మా ఇంటివైపు అలా చూస్తాడేంటి– అనుకున్నాను. కప్పుతోపాటే చేతిని కూడా అందుకుంటే, కుర్చీ చేతి మీద కూచోబెట్టుకుని, "సగం నువ్వు తీసుకోవూ?" అంటున్నారాయన.

ఆయన చేతిని విడిపించుకుంటూ, "ఏవిటీ సరసం? అటు చూడండి" అన్నాను.

ఆయనా కిటికీవైపు చూశారు. ఫక్కుమని నవ్వి, "చూడనీ మనకేం? ఎంత అన్యోన్యంగా వున్నారని అసూయపడతాడు," అన్నారు తేలిగ్గా.


నేనంత తేలిగ్గా అనుకోలేకపోయాను. వెళ్ళి కిటికీ తలుపు వేసి మరీ వచ్చి కూచున్నాను.

సాయంత్రం నాలుగ్గంటలకి కాబోలు వీధి తలుపు చప్పుడయితే వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా పట్టుచీర కట్టుకుని, ఎదురింటామె నిలుచునుంది. ఆమె చేతిని పట్టుకుని వాళ్ళ పాప.

అనుకోకుండా చూడటంవల్లనేమో అయోమయంలో పడిపోయి తేరుకుని లోపలికి ఆహ్వానించాను.

“లేదండీ! మరోసారెప్పుడయినా వచ్చి కూచుంటాను. ఈవాళ మా పాప పుట్టిన రోజు. హారతి ఇస్తాము. ఒకసారి వచ్చి పాపని ఆశీర్వదించి పొమ్మని పిలవాలని వచ్చాను,” అన్నది నవ్వుతూ.

“అలాగా! మంచిది. తప్పకవస్తాను” అని బొట్టుపెట్టి పంపించాను. వెనుదిరిగి వెళుతూ మెట్ల మీద నిలుచుని వెనక్కి తిరిగిన పాప, “తప్పక రావాలి ఆంటీ” అన్నది ముద్దుగా.



"ఆలాగేనమ్మా" అన్నాను.

వాళ్ళు వెళ్ళాకగాని గుర్తు రాలేదు — పాప పేరైనా అడగలేదని.

వెళ్ళాలా వద్దా అని కాసేపు తర్జనభర్జన పడ్డాను. ఏమీ తోచలేదు. మెల్లిగా శ్రీవారితో ప్రస్తావించాను. "దీనికింత ఆలోచనెందుకూ? ఎదురింటికేగా? వెళ్ళొస్తే సరిపోలా! బజారు కెళ్ళి రెడీమేడ్ ఫ్రాక్ ఒకటి పట్టుకొస్తాను. తీసికెళ్ళి ప్రెజంట్ చెయ్యి." అన్నారు. ఏమనాలో తోచక సరేనన్నాను.

ఆరుగంటలు కావస్తుండగా శ్రీవారు తెచ్చిన పాకెట్ పట్టుకుని, బయలుదేరాను. నేవెళ్ళేసరికి, వరండా వెనకే వున్న పెద్ద హాలులో ఓ పది మంది దాకా ఆడవారు కూచుని వున్నారు. బెరుగ్గా తలుపుదగ్గిరే నిలుచున్నాను. కొత్త ఫ్రాక్ వేసుకుని ఎవరో మరో పాపతో ఆడుకుంటున్న వాళ్ళ పాప నన్ను చూసి పరిగెత్తొచ్చింది.

"రండి ఆంటీ" అంటూ చేయి పట్టుకుని లోపలికి లాక్కెళ్ళింది, వాళ్ళమ్మ దగ్గరికి.

"సరిగ్గా సమయానికొచ్చారు. ఉండండి మిమ్మల్ని మన వీధిలో వాళ్ళకి పరిచయం చేస్తాను....అయ్యో నా మతి మండా, మీ పేరే అడగలేదు. నా పేరు మనోరమ. మా పాప పేరు సురేఖ." అన్నది ఆవిడ హడావిడిగా మాట్లాడుతూ.

"నా పేరు ఉమ అండీ" అన్నాను.

తరవాత అయిదునిముషాలు, పరస్పర పరిచయాలతో గడిచిపోయాయి. వీధిలో వాళ్ళందరితో ఈవిడకి బాగా స్నేహంలా వుంది. అందరితో వరసలు పెట్టి మరీ మాట్లాడుతున్నది.

ఎత్తుగా ఓ కుర్చీ వేయించి దానిపైన పాపని కూచోబెట్టి, హారతిచ్చింది మనోరమ — మంచి పాటొకటి పాడుతూ. తర్వాత వచ్చినవాళ్ళలో ఒకరిద్దరు కూడా కాస్సేపు బతిమాలించుకుని పాటలు పాడేరు. తర్వాత వరసగా ఒక్కొక్కరే లేచి, పాప తలపై అక్షతలుంచి, తాము తెచ్చిన బహుమతులుంచి రావటం మొదలయింది. చివరగా నేనూ వెళ్ళి ఇచ్చాను.

మెల్లిగా ఒక్కొక్కరే మనోరమ ఇచ్చిన స్వీట్స్‌కవర్లు పుచ్చుకుని బయలుదేరారు. నేనూ లేవబోయాను. "మీకేమిటి—తొందర కూచోండి కాసేపు. ఎదురిల్లేగా" అని వుంచేసింది నన్ను. హఠాత్తుగా గుర్తొచ్చినదానిలా, "బుజ్జీ, నాన్నారికి దణ్ణం పెట్టావుటే?" అన్నది. "ఓ! ఎప్పుడో పెట్టాను. ప్రెజంటేషన్ పుచ్చుకున్నాను. నువ్వు చెప్పేదాకా ఆగుతానేంటి?" అని గెంతుతూ వరండాలోకెళ్ళిపోయింది పాప.

కాస్సేపు నా గురించి ప్రశ్నించింది మనోరమ. జవాబులు చెబుతూనే, ఆలోచిస్తున్నాను. ఆ ఇల్లు తీరు, ఇంట్లో వున్న నౌకర్లు, చూస్తే బాగా డబ్బున్నవాళ్ళలా వున్నారు. మరి గ్రాండ్ స్టయిల్‌లో పార్టీ ఇవ్వకుండా, ఇలా ఆడవాళ్ళ పేరంటం చేశారేమిటా అనుకున్నాను. ఒకవేళ అతగాడి కిష్టంలేదేమోలే అనుకున్నాను. అతనేం చేస్తారని నేను అడగనూలేదు. ఆవిడ చెప్పనూలేదు. ఇంతలో ఎక్కడినించో కాలింగ్ బెల్ వినిపించింది.

వరండాలో ఆడుకుంటున్న పాప పరుగెత్తుకొచ్చింది.

"చూడు బుజ్జీ! నాన్నారేమో పిలుస్తున్నారు" అన్నది మనోరమ. పైకి పరిగెత్తిన పాప, గెంతుతూ దిగొచ్చి, "అమ్మా! మరే నాన్నారికి ఆకలేస్తూందట. ఇవాళ భోజనం పైకొద్దు. కిందికే వస్తాను — అంటున్నారు. నే తీసుకురానా మరి" అన్నది ఉత్సాహంగా.

"ఆలాగే వెళ్ళు గానీ, జాగ్రత్త! గెంతుతూ దిగకు. జాగ్రత్తగా తీసుకురా" అన్నది మనోరమ.

అతను కిందకి వస్తానని బెల్ కొట్టి చెప్పటమేమిటో, ఈ తీసుకురావటమేమిటో నాకేమీ అర్థం కాలేదు. అయినా, ఇంకా వుండటం బాగుండదని, "మరి నేనింక వస్తానండీ మనోరమా! మీరు భోజనాలు చేయాలేమో" అంటూ లేచాను.

"ఒక్క నిముషం వుండండి" అంటూ లోనికెళ్ళిందామె. అనుకోకుండా, హాలులో పక్కగా వున్న మేడమెట్ల వైపు చూస్తూ నిలుచున్నాను. పాప—వాళ్ళ నాన్నగారి చేయిపట్టుకుని మెల్లిగా మెట్లు దింపుతూంది. చివరి మెట్టు దిగుతూ, "రమా! అయిందా మీ పేరంటం? అంతా వెళ్ళిపోయారా?" అన్నాడతను.

"అమ్మ ఇక్కడలేదు. లోపలికెళ్ళింది నాన్నా. ఎదురింటి ఆంటీ ఒకరే అక్కడ నిలుచున్నారు. అంతా వెళ్ళిపోయారు" అన్నది పాప.

అప్పుడు చూశాను శూన్యంలోకి చూస్తున్న అతని గాజుకళ్ళ వైపు!

అతను పాప చేయి విడిపించుకుంటూ "ఆలాగా! నమస్కారమండీ" అన్నాడు చేతులు జోడిస్తూ.

నేనేమీ అనకముందే, బయటికొచ్చిన మనోరమ, "వచ్చారా? వుండండి. ఒక్క నిముషం!" అంటూ చేతిలో ఉన్న నాలుగు స్వీట్స్ పాకెట్స్ నా చేతిలో వుంచింది. వీధి తలుపు దాకా సాగనంపింది.

కలలోలా అయోమయంగా నడిచి వెళుతున్న నేను, ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను. పాప, మనోరమ చెరొక చెయ్యీ పట్టుకుని అతణ్ణి లోపలికి తీసుకెళ్తున్న దృశ్యం నా కళ్ళ బడింది. □

స్త్రీల 'స్వప్నాంశం' ఏమిటి?—

బ్రిటన్‌లోని ప్రముఖ వనితా పత్రిక 'వుమన్స్‌వోన్' జరిపిన 'సర్వే' ద్వారా— కలలు కనడంలో ఎక్కువమంది స్త్రీలు 'సెక్స్' ప్రధాన విషయంగా కలలు కంటారని తేలింది। ఆ పత్రిక జరిపిన సర్వేలో 77 శాతం 'సెక్స్' విషయంగా ఎక్కువగా కలలు కంటామని చెప్పగా — 72 శాతం తాము ఎవరిచేతనో తరమబడుతున్నట్టుగా ఎక్కువగా కలలు కంటామని చెప్పారు. ఎక్కువగా తమ కుటుంబాల గురించి కలలు కనేవారి శాతం—71

"భీదవానిని భాగ్యపురుషునిగను, భాగ్యవంతుని, రోగిని—నిరోగిగను, నిరోగిని, రోగిగను మార్చగల శక్తిని ప్రకృతి కల్గియున్నది."

—వాశిరెడ్డి వెంకాయమ్మ

"భావగర్భితమును బవిత్రవంతమును నద్భుతమునగు నీ మానవ సృష్టికి స్త్రీ పురుషులు తలిదండ్రులు. వహ్నికి తేజము తెరగున, పూవునకు తావిలీల, చందురునకు కాంతి కరణి, పురుషునకు పురంధ్రి యట్టిది."

—జొన్నలగడ్డ శారదాంబ